# రాఖీ

ఏళ్ల తర్వాత కలిసిన ఆ ప్రేమికులు మళ్లీ ఒకటయ్యారా?

వేటూరి భాస్కరమ్మ కథ

రజని అప్పుడే ఆఫీసులో అడుగు పెట్టింది.

ఆసరికే అందరూ వచ్చేసి సీరియస్‌గా వర్క్ చేసుకోవడంలో మునిగిపోయారు. రోజూకంటే కాస్త భిన్నంగా వున్న ఆ వాతావరణానికి విస్మయపడుతూ రజని తన సీటు కేసి వెళ్లబోయి అసంకల్పితంగా ప్రమీల సీటు కేసి చూసింది.

తనవేపు చూపిన రజనిని సైగచేసి పిల్చింది ప్రమీల.

"ఏంటి రజీ! ఈరోజింత లేటు?" అడిగింది వాచీ చూసుకుంటూ.

"ఇంటివాళ్ల బాబుకు కొద్దిగా జ్వరం. సమయానికి ఆ కుర్రాడి తండ్రికూడా ఇంట్లో లేదు. ఆవిడ అసలే కంగారుమనిషి. నేనే బాబుని హాస్పిటల్‌కు తీసుకెళ్లి డాక్టర్‌కు చూపించి వచ్చాను. అక్కడికీ అన్నంతినకుండానే వచ్చేశాను. ఇంతకూ ఏమైంది?"

"ఇంకా ఏం కావాలి? ఈరోజే క్రొత్త బాస్ వచ్చారు"

"మైగాడ్" తల పట్టుకుంది రజని.

"అతగాడు చాలా స్ట్రిక్ట్. వచ్చి గంటయిందో లేదో అందర్నీ వణికించేశాడు. డేంజరస్ పర్సన్, దూర్వాసుడు..."

"ఇక చాల్లే. అన్ని భాషల్లోనూ నిక్‌నేమ్స్ తర్వాత తగిలించొచ్చుగానీ నువ్వు చూశావా? ఎలా వుంటాడు?"

"ఎక్కడో చూసినట్టే వున్నాడు. చాలా అందంగా... సినీ హీరోలా..." ప్రమీల ఇంకా వర్ణిస్తూనే వుంది. అంతలోనే ప్యూన్ సుబ్బయ్య దూసుకువచ్చేశాడు.

"ఆఫీసరుగారు పిలుస్తున్నారమ్మా" రజనికేసి చూస్తూ అన్నాడు.



''తప్పదన్నట్లు లేచింది రజని. ఫ్యాన్ వెనుకే ఆఫీసర్ గదిలోకి వెదుతున్న ఆమెకేసి జాలిగా చూశారందరూ.

ఆఫీసర్ గదిముందు నిల్చుంది రజని అదురుతున్న హృదయంతో ''మే ఐ కమిన్ సర్?'' మెల్లగా అంది.

''ఎస్ కమిన్'' లోనుంచి గంభీరంగా వినవచ్చింది.

రజని మెల్లగా లోపలకు నడిచింది. ఆఫీసర్ తలవంచుకుని ఏదో ఫైల్ చూస్తున్నారు తదేకంగా. అడుగుల చప్పుడు విని తలెత్తకుండానే అన్నారు.

"కూర్చోండి మిస్..."

"రజని" అందించింది.

వెంటనే తలెత్తి ఆమెకేసి చూశారు. అతని కళ్లలో ఆశ్చర్యం. "నువ్వా రజనీ!"

రజని విభ్రాంతిగా చూసింది. వెంటనే పోల్చుకుంది. "మీరు... మీరు శశికాంత్ కదూ" అంది తడబాటుగా.

"పోల్చుకున్నావన్నమాట" అంటూనే బెల్ నొక్కాడు శశికాంత్. ప్యూన్ రాగానే "రెండు కాఫీలు పట్టా" అని ఆజ్ఞాపించాడు.

"ఇప్పుడెందుకు సార్!" అంది రజని మొహమాటంగా.

"ఇదుగో ఆ సారూగీరూ తీసేయ్ ఎప్పటిలా 'శశీ' అని పిలువ్" అన్నాడు శశికాంత్ నవ్వుతూ.

"అమ్మో" భయం నటించింది రజని.

కాఫీ వచ్చింది. తనొకటి తీసుకుని రజనికి ఒకకప్పు అందించాడు శశి.

ఇద్దరూ కాఫీ సిప్‌చేస్తూ ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకోసాగారు ఆరాటంగా.

"రజనీ! ఎలా వున్నావ్? ఎన్నాళ్లకు చూశాన్నిన్ను" అన్నాడు శశికాంత్.

రజనికి మాట్లాడాలంటేనే ఏదో జంకుగా వుంది. 'అతను ఎంత తెలిసినవాడైనా ఇప్పుడు తనపై అధికారిగదా. జాగ్రత్తగా వుండాలి' అనుకుంది.

శశికాంత్ ఏదో కాగితం అందించాడు. "ఈ మేటర్ టైప్‌చేసి ఒక గంటలో తీసుకురా రజనీ! నాలుగు కాపీలు కావాలి"

రజని తీసుకుని లేచింది. "ఇక వెళ్తా సార్" అంది.

"వచ్చే ఆదివారం సాయంత్రం అలా పార్కుకి వెడదాం ఎన్నో మాట్లాడాలి నీతో రాగలవా" అడిగాడు శశికాంత్.

"అలాగే శశీ!" అంది రజని.

"ఓ గుడ్‌గాల్! అలా పిలవాలి" నవ్వాడు.

అనుకోకుండా పూర్వంలా అలా పిల్చినందుకు సిగ్గుపడింది రజని. వచ్చేస్తుంటే మళ్లీ చెప్పాడతను. తల ఊపి వచ్చేసింది రజని.

మామూలుగా ఇంకా చెప్పాలంటే ఆనందంగా వెలిగిపోతున్న రజని ముఖంకేసి ఆశ్చర్యంగా చూశారంతా. ప్రమీలైతే అడిగేసిందికూడా.

మెల్లగా చెప్పింది రజని. "అతనెవరోకాదు ప్రమీ! శశి"

"లక్కీ గాల్!" అభినందించింది ప్రమీల మనస్ఫూర్తిగా.

శశి అంటే ఎవరో ప్రమీలకేగాదు ఆ ఆఫీసులో అందరికీ తెలుసు రజనిద్వారా. ఆమె పెళ్లీడు దాటిపోయినా అవివాహితగా మిగిలిపోవడంచూసి ఒకళ్లిద్దరు ఆమెను పెళ్లి చేసుకోవాలనిప్రయత్నించగా అప్పుడు చెప్పింది రజని తన కథ. ఇప్పుడామె ఆఫీసులో అందరికీ ఒకమంచిస్నేహితురాలుమాత్రమే.

"అయితే రజీ అతనికి వివాహం..." సగంలోనే ప్రమీలను ఆపేసింది రజని.

"ఏదీ ఇంకా ఈవేళేగా కలిశాం. తాపీగా అన్నీ తెలుస్తాయ్" అంది టైప్ మిషన్‌లో కాగితం పెడుతూ.

◇ ◆ ◇

ఆదివారం రాత్రి...

రజని భోజనం చేయకుండానే పడుకుంది. ఆమె మనసు తీరని ఆశాభంగానికి లోనైంది. శశికోసం తను ఇన్నేళ్ళూ ఎంతగా ఎదురుచూసింది! తన హృదయంలోనుంచి అతని రూపాన్ని తొలగించలేక మరొకర్ని జీవితంలోకి ఆహ్వానించలేక ఎంతగా మధనపడింది! ఇన్నాళ్ల తన నిరీక్షణ వృధాయేనా?' పార్కులోని సంఘటన సినిమా రీలులా ముందు నిల్చుంది.

ఆదివారం సాయంత్రం ఐదు కాగానే రజని ముస్తాబుకానిచ్చి బ్యాగ్ తీసుకుని పార్కుకి నడిచింది. అప్పటికే శశికాంత్ ఆమెకోసం వెయిట్ చేస్తున్నాడు. ఆమె రాగానే విష్‌చేశాడు. ఇద్దరూ లోపలకు నడిచి ఎవరూ లేనిచోటుచూసుకుని సిమెంట్ బెంచీమీద కూర్చున్నారు.

''రజనీ! నీకు వివాహం అయ్యిందా?'' మాంగల్యం లేని రజని మెడకేసి చూస్తూ అడిగాడు శశికాంత్.

''కాలేదు'' అంది రజని తలవంచుకుని గోళ్లవంక చూసుకుంటూ.

''కాలేదా?''అన్నాడతను విహ్వాలంగా.

వింతగా చూసింది రజని.

''అవును. ఎందుకంత ఆశ్చర్యం''

''ఆశ్చర్యం కాదామరి. మీ అన్నయ్య శుభలేఖకూడా పంపించాడు''

''అవును నిజమే''

''మరి...?''

''అమ్మకోసం ఆ పెళ్లికి ఒప్పుకోక తప్పలేదు. అన్నీ సిద్ధమైపోయాయి''

''మరి పెళ్లెందుకు జరుగలేదు'' ఆత్రంగా అడిగాడు శశికాంత్.

''వరుడు పెళ్లికి వస్తూ యాక్సిడెంట్‌లో చనిపోయాడు''

''అయామ్ సారీ...''

''ఆ తర్వాత నాకు పెళ్లికాలేదనే బెంగతో అమ్మ మంచంపట్టి ఏడాది తర్వాత చనిపోయింది. నాన్నగారికి మతి తప్పింది. ఈ మధ్యే ఆయనా పోయారు'' బాధగా

# హంతకురాలు



కాలిఫోర్నియాలో అన్నా మేరి అనే హంతకురాల్ని పోలీసులు అరెస్టు చేశారు. ఆమె మొక్కల్ని పెంచుతూ వచ్చినా ఒక బొట్టు నీరు విదిల్చేది కాదు. చిన్న చిన్న ముక్కలుగా ఆ మొక్కల్ని నరికి పోగెట్టడం, మంటలో వాటిని బిగుసుకుపోయేట్లు చేయడం, నిప్పు అంటించి వాటిని చంపడం ఆమె కుళ్లు సరదాలు. 8 నెలల కాలంలో 127 మొక్కల్ని, అనేక చెట్లను ఇలా హింసించి చంపింది ఆ పాతకి! అంతే చుట్టుపక్కలవారు ఆమెపై నిఘావేసి పోలీసు కంప్లెయింట్ ఇవ్వగానే పోలీసులు ఆమెకి 6 నెల జైలుశిక్షతోపాటు మొక్కల నర్సరీలో పనిచేయాలని నిబంధన విధించారు.

— అచ్యుతుని రాజ్యశ్రీ

అంది రజని.

''ఈ విషయాలు మీ అన్నయ్యైనా రాయలేదు ఎప్పుడూ''

''అన్నయ్య వెంటనే స్టేట్స్‌కు వెళ్లాడు. తిరిగిరాగానే ఒక కోటీశ్వరుడి కూతురితో పెళ్లి అయింది. వాడిప్పుడు నన్నే మర్చిపోయాడు. మీరేం గుర్తుంటారు?'' అంది రజని.

''రజనీ! చివరికి ఎలా జరిగిందో చూడు. నీ పెళ్లి అయిపోయిందనే మేము భావించాం. మాకెవరికీ పెళ్లికి రావాలన్పించలేదు. మా చెల్లాయి ఫ్రెండు రాధ సవతి తల్లి చేతుల్లో నరకం అనుభవిస్తోంది. 'ఆమెను ఆ ఊబినుంచి బయటకు లాగరా అన్నయ్యా' అంది మా చెల్లాయి. నీకెలాగూ పెళ్లయిపోయిందికదా అని ఇష్టం లేకపోయినా సరేననక తప్పిందికాదు''

''అలాగా చాలా బావుంది'' అంది రజని. ఇంకేమంటుంది.

రాధ కాన్పుకు పుట్టింటికి వెళ్లిందట. మొదట ఒక బాబుట. ఈసారితో సరిపెడతారుట.

''అదృష్టవంతురాలు'' అంది బాధను దాచుకుని.

''రజనీ! దేవుడు అనుకూలిస్తే ఆ స్థానంలో నీవుండేదానివికదా''

రజని కళ్లల్లో నీళ్ల తిరిగినై.

ఆ తర్వాత ఇంకేమీ మాట్లాడుకోకుండా చాలాసేపు అలానే కూర్చుండిపోయారు.

''రేపు నా పుట్టినరోజు'' అంది రజని. ఏదో ఒకటి మాట్లాడాలన్నట్లు.

''అవునుకదూ రేపు రాఖీపౌర్ణమి'' అన్నాడు శశికాంత్.

రజనికి ఆ రోజులు గుర్తొచ్చినై. తమకు పరిచయం అయిన సంవత్సరం తన పుట్టిన రోజుకు శశికాంత్ ఎంత ఆర్భాటం చేశాడు. తమది పల్లెటూరనీ, అందరూ వింతగా చూస్తారనీ తను వారించినా వినకుండా పట్నం వెళ్లి కేక్ కొన్నాడు. క్రొవ్వొత్తులు పేర్చాడు. తన స్నేహితురాళ్లందర్నీ పార్టీకి పిలువమన్నాడు. తనకు ఖరీదైన చీర తెచ్చాడు. అతనికి చీరెల సెలక్షన్ బాగా తెలుసు. తనస్నేహితురాళ్లువింతగానోమెచ్చుకున్నారు.

''చీకటిపడుతోందిరజనీ! వెడదామా''

రజని ఉలిక్కిపడి వాచీ చూసుకుంది. ఏడు కావస్తోంది. శశికాంత్ వెనుకే బయటకు వచ్చింది. ఇద్దరూ కారు దగ్గరకు చేరుకున్నారు.

''నేను వెళ్లిపోగలను. మా ఇల్లు ఇక్కడకు దగ్గరే''

''అదేంటి రజనీ! మీ ఇంటికి నేను రాకూడదా? రేపు నీ పుట్టినరోజు పార్టీకి రావాలంటే మీ ఇల్లు తెలియాలికదా''

మౌనంగా కారెక్కింది. స్టార్ట్ చేశాడు శశికాంత్. అతని ప్రక్కన అలా కూర్చోటం ఏదో హాయిగా, ఆనందంగా వుంది రజనికి. పోగొట్టుకున్న పెన్నిధి దొరికినట్లుగావుంది.

రజని గుర్తులు చెబుతుంటే మెల్లగా నడుపుతూ ఇంటికి చేర్చాడు. రజని దిగి హాండ్‌బ్యాగ్‌లోంచి తాళం చెవులు తీసి తలుపులు తెరిచింది. లోపలకు నడిచి లైట్ వేసింది.

''అదేం ఎవరూ లేరా?''

''నేనొక్కదాన్నే. ఇంటివాళ్లు తిరుపతి వెళ్లారు''

''మరి ఒక్కదానివి...''

"ఫరవాలేదు. పనిమనిషి వస్తుంది పదుకోటానికి. రండి కాఫీ త్రాగి వెదుదురుగాని" అంటూనే రజని కిచెన్‌లోకి వెళ్లింది.

శశికాంత్ కుర్చీలో కూర్చున్నాడు. రజని తిరిగి వచ్చేసరికి అతను టేబుల్‌మీదున్న ఫ్రేములో తన ఫోటో చూస్తున్నాడు.

"రజనీ నువ్వింకా నన్ను..." పూర్తిచేయలేకపోయాడా వాక్యాన్ని.


రజని తలవంచుకుంది. కాఫీ త్రాగి శశికాంత్ వెళ్లిపోయాడు. ఆపుకోలేని దుఃఖంతో మంచంమీద వాలిపోయింది రజని. ఆమె మనసు మళ్లీ గతంలోకి పరుగులు తీసింది.

◇ ◆ ◇

రజని అన్నయ్య మురళీ, శశికాంత్ ప్రాణస్నేహితులు. ఆ వేసవి సెలవులలో నాలుగు రోజులు పల్లెటూరి అందాలను ఆలోకించాలని మురళితోబాటు వచ్చాడు శశికాంత్.

అప్పుడు రజనికి పద్దెనిమిదేళ్లు. ఉన్న ఊళ్లో టెన్త్ పాసై ప్రైవేటుగా బియ్యేకి కట్టింది. అపురూపమైన అందానికి వసంతంలాంటి వయసు తోడుకాగా విరిసిన జాజిపూవులా వుండేది రజని. మీనాల్లాంటి కళ్లను రెపరెపలాడిస్తూ శశి చెప్పే కాలేజీ కబుర్లు వినేది. శశికాంత్ ఆడపిల్లలను టీజ్ చేసే విషయాలు విని ఉడుక్కునేది. ఆమెను ఆ భంగిమలో చూడాలని ఎన్నో కల్పించి చెప్పేవాడతను. తర్వాతెప్పుడో క్షమాపణ కోరుకునేవాడు.

నాలుగురోజులు గడపాలని వచ్చిన శశికాంత్‌ను రజని అందం కట్టిపడేసింది. నెలవరకూ అక్కడే వుండిపోయాడు. రోజూ ముగ్గురూ ఊరి చివరి మామిడితోటల్లోకి షికారు వెళ్లేవారు. రజనీ శశిలకు ఏకాంతాన్ని కల్పిస్తూ మురళి తప్పుకునేవాడు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటూ గడిపేవారు. శశికాంత్ రజనిని తమకంగా ముద్దుపెట్టుకునేవాడు. గాఢంగా హృదయానికి హత్తుకునేవాడు. ఇంకా ఏమోమో చెయ్యబోతే



వారించేది రజని.

"ప్లీజ్ రజనీ! ఒక్కసారి...." ప్రాధేయ పడేవాడు.

"వద్దు శశీ! పెళ్లికాకుండా" అనేది రజని.

"ఈ మాధుర్యపుటంచుల్ని ఒక్కసారి అధిగమించనియ్యి రజనీ! తర్వాత మనం ఏమైపోయినా ఫర్వాలేదు" అనేవాడతను.

ఆ మాటలకు అర్థం రజనికి అప్పట్లో తెలియరాలేదు. ఇప్పుడాలోచిస్తుంటే అర్థమవుతుంది. నిజమే అప్పుడని మాట వినివుంటే ఇప్పుడీ చిత్రవధ తప్పేది తనకు.

శశికాంత్ వెళ్లిపోయాడు. కొన్నాళ్లపాటు ఇద్దరిమధ్యా ఉత్తరాలు నడిచేయి. ఒకసారి రజని వాళ్లమ్మ చేతిలో పడిందతను రాసిన ఉత్తరం. ఆ కులంకానివాణ్ణి నువ్వు పెళ్లిచేసుకుంటే నేను ఉరివేసుకుని ఛస్తాను అందావిడ. విధికి తలవంచింది రజని. తర్వాత వేణుతో పెళ్లి నిశ్చయమైంది. పెళ్లికాకుండానే అతను అకాల మృత్యువు వాతబడ్డాడు. ఏడాది తేడాతో రజని తల్లిదండ్రులుకూడా చనిపోయారు. రజని చదువు పూర్తిచేసి హైపు పరీక్షలుకూడా పాసైంది. మురళి స్టేట్స్‌నుంచి వచ్చాడు. పెద్ద ఉద్యోగం దొరికింది. డబ్బున్న అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు.

ఇంటివాళ్ల గోడగడియారం పన్నెండు గంటలు కొట్టింది. రజని ఒకసారి దానికేసి చూసి మళ్లీ ఆలోచనల్లో మునిగింది.

ఒక్కొక్కసారి భయంకరమైన ఒంటరి రాత్రులు ఆమెను వణికించేవి. ఈ బ్రతుకుకు ప్రయోజనం ఏముంది? ఈ యౌవన కుసుమం ఇలానే మిగిలిపోయి ఎప్పుడో రేకులు రాలి ధూళిలో కలసిపోతుంది. అనుకుంటే కన్నీరు వరదయ్యేది. శశికాంత్ తలపులతోటే ఇప్పుడామె బ్రతుకుతుంది. అతనన్నట్లు ఒక్కసారి జీవనమకరందాన్ని ఆస్వాదించి వుంటే... తల విదిలించింది రజని. ఇప్పుడు మాత్రం ఏం మించిపోయింది? రేపు తన శశి వస్తాడు. అప్పుడు తన కోరిక అతనికి నివేదించుకుంటుంది. తనని అతనికి ఆనందంగా అర్పించుకుంటుంది. ఒక్కసారి ఆ మాధుర్యాన్ని పొందగలిగినా చాలు. తన జన్మ ధన్యమైనట్లే...

◇ ◆ ◇

ఆరోజు రాఖీపౌర్ణమి. రజని పుట్టినరోజు. ఉదయాన్నే లేచి అభ్యంగన స్నానం చేసింది రజని. పనిమనిషి సాయంతో ఇల్లంతా నీట్‌గా సర్దింది. శశికాంత్‌కిష్టమైన మైసూర్ పాక్, పకోడీ చేసింది. సాయంత్రం కాగానే మళ్లీ స్నానంచేసి తెల్లని చీర, జాకెట్ ధరించింది. తలలో విరజాజుల మాల తురుముకుంది. ఆ అలంకరణలో ఆమె పదేళ్ల చిన్నదానిగా కన్పిస్తోంది.

వీధి తలుపు చప్పుడైంది. కంగారుగా లేచివెళ్లింది రజని. శశికాంత్ గేటు తీసుకుని లోపలకు వచ్చాడు. వీధి తలుపులు తమూసి బోల్టువేసింది రజని.

తను తెచ్చిన ప్యాకెట్టు ఆమెకు అందించాడతను. ప్యాకెట్టు విప్పిందామె. నల్లని బోర్డరు ఉన్న గులాబిరంగు జార్జెట్ చీర మెత్తగా జారిపోతోంది.

"చీర కట్టుకుని రా రజనీ!" అన్నాడు శశికాంత్ నవ్వుతూ. జరనికి ఈరోజు అతను కొత్తగా కనిపిస్తున్నాడు. నలభై ఏళ్లు వచ్చినా ఆనాటి కొంటె అబ్బాయిలానే

వున్నాడు. రజనికి అతన్ని చూడాలంటేనే ఎందుకో సంకోచంగా వుంది. అలానే నిల్చుండిపోయింది.

"వెళ్ళ రజనీ!" అన్నాడతను మళ్ళీ.

మంత్రముగ్ధలా లోపలకు నడిచిందామె. తిరిగి వచ్చిన ఆమెకేసి అప్రతిభుడై చూస్తుం డిపోయాడు శశికాంత్.

తెల్లని పాలరాతి బొమ్మలాంటి రజనికి ఆ చీర ఎంతో అందంగా సూటైంది. నల్లని జాకెట్టు. కాటుక తీర్చిన సోగకళ్ళు, కొనదేరి న ముక్కు. లిప్‌స్టిక్ అవసరంలేని ఎర్రని పెదిమలు. బారైన జడ.

"టిఫిన్ తీసుకోండి" అన్న రజని మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు శశికాం త్

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ముగిం చారు. వక్కపొడికోసం చేయిచాస్తూ ఆమె కళ్ళల్లోకి చూశాడతను. తన మనసులోని కోరిక అతనికి చెప్పడానికి అదే మంచి సమయం అనుకుంది రజని. తన కళ్ళల్లోకి చూస్తున్న అతనికేసే చూస్తూ చావివున్న అతని చేతిని అందుకుంది.

"అన్నట్లు మరిచేపోయాను" అంటూ అతని జేబులోనుంచి చిన్న ప్యాకెట్ ఒకటి బయటకు తీశాడు. "ఏంటది ఉంగరమా?' ' ఆత్రంగా దాన్ని అందుకుంది రజని. విప్పి చూసింది.

రాఖీ!

"రజనీ! ఇది నా చేతికి కట్టు" అన్నాడు శశికాంత్.

రజని హృదయంలో కారుచీకట్లు అలుముకున్నాయి. మౌనంగా దాన్ని అందుకుని అతని చేతికి కట్టింది. వంచిన ఆమె కళ్ళ అశ్రుధారలను వర్షించి రాఖీని తడిపాయి.

శశికాంత్ జాలిగా ఆమె తల నిమురుతూ వుండిపోయాడు.

## డైటింగ్

హోటల్‌కి వచ్చిన ఒకామె నాలుగు చపాతీలు, మూడు దోసెలు, నాలుగు ఇడ్లీలు తిని పాలు తీసుకురమ్మంది సర్వర్‌ని.

"బాదంపాలు తీసుకురమ్మంటారా?"

"అమ్మో వద్దు... వళ్లు వేస్తుంది" అంది ఆవిడ.

— కె.వి.మధుసూదన్‌రావు (కాకినాడ)

